క్లుప్తంగా

రెండు బైకులు ఢీ.. వ్యక్తికి తీవ్రగాయాలు

దామెర: ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. దామెర మండలంలోని పసరగొండ క్రాస్ వద్ద బుధవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి, స్థానికులు, 108 సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. హసన్‌పర్తి మండలం అర్వపల్లికి చెందిన మల్కపురం కొమురయ్య ఊరుగొండ నుంచి పసరగొండ వైపునకు టీవీఎస్ ఎక్సల్‌పై వెళ్తున్నాడు. పసరగొండ క్రాస్ వద్ద మరో బైక్ వేగంగా వచ్చి టీవీఎస్ ఎక్సల్‌ను బలంగా ఢీకొట్టింది. దీంతో కొమురయ్య ఎడమకాలు నుజ్జునుజ్జయింది. వెంటనే స్థానికులు స్పందించి 108కు సమాచారం అందించడంతో క్షతగాత్రున్ని చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

సమస్యలు పరిష్కరించాలి



ఆత్మకూరు: జీపీ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని కోరుతూ.. బుధవారం మండలకేంద్రంలోని మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న కారోబార్లు, బిల్‌కలెక్టర్లను అసిస్టెంట్ పంచాయతీ కార్యదర్శులుగా ప్రత్యేకహోదా కల్పించి రూ.21,500 కనీస వేతనం ఇవ్వాలని సమస్యలు పరిష్కరించే వరకు నిరవధిక సమ్మె చేయనున్నట్లు తెలిపారు. పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో జీపీ కారోబార్స్, వడ్డెపెల్లి రాంబాబు, మల్లారెడ్డి, రవి, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులను గుర్తించాలి



దామెర: గ్రామాల్లో ఉపాధిహామీ పథకంలో భాగంగా చేపట్టాల్సిన పనులను గుర్తించాలని ఎంపీడీఓ శ్రీనివాస్ రెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఉపాధిహామీ పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధిహామీ పనుల ప్రగతిని గ్రామాలవారీగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడారు. ఉపాధిహామీ పనులకు అధిక సంఖ్యలో కూలీలు హాజరయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పనులు నిర్వహించే చోట కూలీలు ఇబ్బందులను గుర్తించి ఏర్పాట్లు చేయాలని సూచించారు. సమావేశంలో ఏపీఓ శారద, ఈసీ రాజేష్, టీఏలు సురేందర్, ప్రిసిల్లా, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నాలుగు ట్రాక్టర్లు సీజ్



శాయంపేట : ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా మొర్రం తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను సీజ్‌చేసినట్లు తహసీల్దార్ చలమల్ల రాజు తెలిపారు. రెవెన్యూ శాఖ నుంచి ఎలాంటి అనుమతి లేకుండా మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో అక్రమంగా మొరం తరలిస్తున్నారని ఫిర్యాదు మేరకు బుధవారం ఏఆర్ఐ హుస్సేన్, వీఆర్ఏలు వెళ్లగా రెండు ట్రాక్టర్లలో నింపి ఉన్న మొర్రం ట్రాక్టర్లను మరో రెండు ఖాళీ ట్రాక్టర్లను గుర్తించారు. పోలీసుల సహకారంతో స్వాధీనం చేసుకొని సీజ్ చేసి తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. అనుమతులు లేకుండా మొరం తరలించినందుకు జరిమానా విధిస్తామని తహసీల్దార్ రాజు తెలిపారు.

మహిళలు, బాలికల రక్షణకు షీ టీమ్స్

హన్మకొండ /వరంగల్ క్రైం : మహిళలు, బాలికల రక్షణకు షీటీమ్స్ పని చేస్తున్నాయని షీటీం ఇన్‌స్పెక్టర్ వై.సంజీవరావు అన్నారు. హనుమకొండ విద్యానగర్‌లోని సెయింట్ పీటర్స్ ఫార్మసీ కళాశాలలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియాలో వ్యక్తిగత ఫొటోలు, వివరాలు పంచుకోవడంలో అమ్మాయిలు జాగ్రత్త వహించాలని చెప్పారు. సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. సైబర్ నేరానికి గురైనట్లు గ్రహిస్తే టోల్ ఫ్రీ నంబర్ 1930కు ఫిర్యాదు చేయాలన్నారు. ఇబ్బందులు ఎదురైనప్పుడు 87126 85257, 87126 85142, 87126 85270 నంబర్లలో సంప్రదించాలని కోరారు. ఈ సందర్భంగా షీ టీమ్స్ సమాచార వాల్‌పోస్టర్లను ప్రదర్శించారు. సెయింట్ పీటర్స్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ రాజశేఖర్, షీ టీమ్ ఎస్సై విద్యాసాగర్, హెడ్ కానిస్టేబుల్ బిచ్యా నాయక్, కానిస్టేబుల్ వంశీకృష్ణ, సెయింట్ పీటర్స్ ఎడ్యు స్కూల్ కరస్పాండెంట్ నారాయణ రెడ్డి పాల్గొన్నారు.

వదలని వాన.. తీరని గోస

- పంట నష్టపోతున్న రైతులు
- నేలవాలిన వరి, మొక్కజొన్న
- ప్రభుత్వం ఆదుకోవాలని రైతుల విన్నపం

ఆత్మకూరు: మండలంలో మంగళవారం రాత్రి కూడా అకాల వర్షం కురిసింది. దీంతో రైతులకు కోలుకోలేని నష్టం వాటిల్లింది. గత నాలుగురోజులుగా రాత్రి కురుస్తున్న వడగండ్ల వానలకు మండలంలోని ఆత్మకూరు, కటాక్షపూర్, పెద్దాపూర్, నీరుకుళ్ల తదితర గ్రామాల శివార్లలో పంటలు దెబ్బతిన్నాయి. మొక్కజొన్న, వరి పంటలు పూర్తిగా నేలపాలయ్యాయి. పంటలు లేవకుండా పడిపోయాయి. దీంతో రైతులు ఆవేదన చెందుతున్నారు.

కమలాపూర్‌లో..

కమలాపూర్: కమలాపూర్ మండల వ్యాప్తంగా మంగళవారం రాత్రి మళ్లీ అకాల వర్షం కురిసింది.



దెబ్బతిన్న వరిపంటలో రైతు రాజయ్య

శనివారం రాత్రి ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన అకాల వర్షం, వడగళ్ల వాన సృష్టించిన భీభత్సంతో వేలాది ఎకరాల్లో వరి, మొక్కజొన్న, మామిడి పంటలకు అపార నష్టం వాటిల్లగా రైతులు ఆ భీబత్సం నుంచి కోలుకోక ముందే మళ్లీ



కమలాపూర్ : తడిసిన ధాన్యం

అకాల వర్షం కురియడంతో రైతుల పరిస్థితి మూలిగే నక్కపై తాటి పండు పడ్డట్లు అయింది. మంగళవారం రాత్రి కురిసిన అకాల వర్షానికి కొనుగోలు కేంద్రాల్లోని వరి ధాన్యం తడిసిపోగా, అరకొరగా మిగిలిన పంటలు కూడా దెబ్బతిన్నాయి. ప్రకృతి ప్రకోపంతో చేతికొచ్చిన పంటలు నష్టపోవాల్సిన పరిస్థితి తలెత్తిందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు. మండల వ్యాప్తంగా 5.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

రైతులను ఆదుకోవాలి

వడగండ్ల వానలకు పంటలన్నీ నష్టమైనయి.. మమ్ములను ప్రభుత్వమే ఆదుకోవాలె. నేను 8ఎకరాలు కౌలుకు తీసుకొని వరిపంట వేసిన. ఎకరానికి రూ.35వేల వరకు పెట్టుబడి పెట్టిన. మొత్తం నష్టమైంది.

– మంగ రాజయ్య, రైతు, పెంచికలపేట

దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాం

- ఎమ్మెల్యే అరూరి రమేష్

ఐనవోలు: రైతుల కోసం ఏ రాష్ట్ర ప్రభుత్వం చేయని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తూ దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నామని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. బుధవారం నందనం రైతు సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో నందనం, రాంనగర్, రెడ్డిపాలెం గ్రామాల ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావుతో కలిసి ఎమ్మెల్యే అరూరి రమేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతు సంక్షేమమే లక్ష్యంగా, రైతును రాజును చేయడమే ధ్యేయంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. రైతులు అహర్నిషలు కష్టపడి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని తెలిపారు. గ్రేడ్ ఏ ధాన్యం క్వింటాలుకు రూ.2,060, గ్రేడ్ బీ ధాన్యం రూ.2,040కు కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. రైతులకు కొనుగోలు కేంద్రాల్లో



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి, ధాన్యం తూకం వేస్తున్న ఎమ్మెల్యే రమేష్, డీసీసీబీ చైర్మన్

ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నిర్వాహకులు చూసుకోవాలన్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలని కోరారు. ఏ సమస్యలు వచ్చిన రైతులు ఆందోళన చెందవద్దని భరోసా కల్పించారు. జెడ్పీ వైస్ చైర్మన్ గజ్జెల శ్రీరాములు, సర్పంచ్‌లు మంజుల, శ్రీనివాసరావు, ఏఓ కవిత, తక్కళ్లపెల్లి చందర్‌రావు, శ్రీనివాస్, బుచ్చిరెడ్డి, ఏఈఓ విశ్వభాను పాల్గొన్నారు.

మండల సభ వాయిదా

శాయంపేట : మండల సర్వసభ్య సమావేశం సభ్యులు హాజరు కాకపోవడంతో బుధవారం నిర్వహించనున్న మండల సభ కోరం లేక వాయిదా వేసినట్లు ఎంపీడీఓ ఆమంచ కృష్ణమూర్తి తెలిపారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీటీసీ సభ్యులు హాజరు కాకపోవడంతో సభను వాయిదా వేసి, త్వరలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ తెలిపారు.

రైతుల సంక్షేమమే కేసీఆర్ లక్ష్యం

- ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య

ధర్మసాగర్: రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను మద్దతు ధరకు రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతు సంక్షేమమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ పాలన కొనసాగిస్తున్నారని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య అన్నారు. ధర్మసాగర్ మండలంలోని పలు గ్రామాల్లో పీఏసీఎస్, ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ఆయన ప్రారంభించి, మాట్లాడారు. ఎద్దు ఏడ్చిన యవుసం రైతు ఏడ్చిన దేశం బాగుపడదని అన్నారు. రైతులు మధ్య దళారుల చేతిలో మోసపోవద్దని, విత్తనం నుంచి విక్రయం వరకు అంతా రాష్ట్ర ప్రభుత్వమే చూసుకుంటుందని తెలిపారు. సీఎం కేసీఆర్ రైతుల పక్షపాతి అని.. రైతుల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నాడని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించే నాటికి తెలంగాణలో కేవలం 22.74 లక్షల ఎకరాల్లో మాత్రమే వరి సాగు చేయబడిందని, కానీ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించిన అనంతరం సీఎం కేసీఆర్ సాగు నీటి



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టడంతో రాష్ట్రంలో 1.24 కోట్ల ఎకరాల భూమి సాగు అవుతుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో రైతులు పండించిన ధాన్యాన్ని మొత్తం కూడా కేంద్ర ప్రభుత్వంతో సంబంధం లేకుండా రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని తెలిపారు. అనంతరం ధర్మసాగర్ తహసీల్దార్ కార్యాలయం వద్ద 25 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ నిమ్మ కవిత, తహసీల్దార్ రజని, ఎంపీడీఓ జవహర్‌రెడ్డి, ఏఓ పద్మ, మల్లక్‌పల్లి సర్పంచ్ మునిగెల రాజు, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీలో యువతకు పెద్దపీట

- ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

ఆత్మకూరు: బీఆర్ఎస్‌లో యువతకు పెద్దపీట వేస్తున్నామని ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. మండలకేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ యువకులు బుధవారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బీఆర్ఎస్‌లో చేరారు. వీరిని ఎమ్మెల్యే ధర్మారెడ్డి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నేతృత్వంలో యువతకు ఇస్తున్న అవకాశాలకు ఆకర్షితులై యువకులు బీఆర్ఎస్‌లో చేరడం మంచి పరిణామమన్నారు. పరకాల నియోజకవర్గంలో రానున్న రోజుల్లో యువతకు మంచి అవకాశాలు ఇస్తానన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా నియోజకవర్గంలో అభివృద్ధిపనులు జరుగుతున్నాయని



ఆత్మకూరు: పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే చల్లా

తెలిపారు. ఆత్మకూరు గ్రామంలో యువకులంతా కష్టపడి గ్రామ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రేవూరి సుధాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు పాపని రవిందర్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు వంగాల భగవాన్‌రెడ్డి, రాసమల్ల నరేందర్, పాదిల రాంమూర్తి తదితరులు పాల్గొన్నారు.



శాయంపేట : ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన నాయకులు

బీఆర్ఎస్‌లో చేరికలు

శాయంపేట : మండలంలోని రాజపల్లి కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ మాజీ అధ్యక్షుడు పోలుసాని బాపూరావు, ప్రధాన కార్యదర్శి మునిపాక సూరయ్య భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణరెడ్డి సమక్షంలో బుధవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. గజ్జెల రాజు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలనుంచి ధాన్యం తరలించాలి

ధర్మసాగర్: మండలంలోని అన్ని గ్రామాల్లో వడ్ల కొనుగోలు కేంద్రాలనుంచి వెంటనే ధాన్యం తరలించే ఏర్పాట్లు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు గంకిడి శ్రీనివాస్‌రెడ్డి బుధవారం ప్రకటనలో డిమాండ్ చేశాడు. అకాల వర్షాలతో చేతికందిన పంటలు దెబ్బతిన్నాయని, కల్లాల్లో ఆరబోసిన ధాన్యం అకాల వర్షాలతో తడిసి ముద్దయ్యాయని, తడిసిన ధాన్యాన్ని కూడా అధికారులు షరతులు లేకుండా మద్దతు ధర చెల్లించి తీసుకోవాలని డిమాండ్ చేశాడు. రైతుల వద్ద కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించి రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని కోరారు. కొనుగోలు కేంద్రాల వద్ద గన్ని సంచుల కొరత లేకుండా చూడాలని, మిల్లర్లు ఎలాంటి కండీషన్లు లేకుండా ధాన్యాన్ని దిగుమతి చేసుకోవాలని కోరారు. వాతావరణంలో మార్పుల వల్ల రైతులు ఆయోమయంలో ఉన్నారని, కలెక్టర్, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు స్పందించి రైతులకు అండగా నిలువాలని కోరారు.

మండల ఫర్టిలైజర్స్ కమిటీ ఎన్నిక



ఆత్మకూరు: మండల ఫర్టిలైజర్స్, అండ్ పెస్టిసైడ్స్ వ్యాపారుల కమిటీ ఎన్నిక బుధవారం మండలకేంద్రంలో జరిగింది. అధ్యక్షుడిగా అర్షం కుమారస్వామి, ఉపాధ్యక్షులుగా సిరంశెట్టి సుమన్, బైరి సూర్యప్రకాశ్, ప్రధాన కార్యదర్శిగా పోతరాజు రాము, కోశాధికారిగా నర్మెట్టి రవితేజ, సహాయకార్యదర్శిగా కంచ రవీందర్, ముఖ్యసలహాదారులుగా రేవూరి దేవేందర్‌రెడ్డి, ముద్దం మల్లికార్జున్, తాటిపెల్లి రవీందర్, ఆర్గనైజర్లుగా మిరియాల రాజు, బలవంతుల రాజు, కార్యవర్గసభ్యులుగా కొండగాని ప్రసాద్, కీత రజనీకాంత్, బైరి ప్రేమ్‌కుమార్, వెల్దె రాజు ఎన్నికయ్యారు.

నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలి

శాయంపేట : మండల పరిధిలోని గ్రామాల్లో ఇటీవల కురిసిన అకాల వర్షాలకు మొక్కజొన్న, వరి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని, పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించి ఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు చిలుకల కొమురయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని ప్రగతి సింగారం గ్రామంలో బుధవారం ఎంసీపీఐ(యూ), సీపీఐ(ఎం) నాయకులు సంయుక్తంగా నేలవాలిన మొక్కజొన్న, వరి పంటక్షేత్రాలను సందర్శించి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెంట తిరుపతి, చిలుకల రాజయ్య, మాదం శ్రీకాంత్, రవి, సతీష్, సమ్మయ్య పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

ఎల్కతుర్తి: వరుసగా కురుస్తున్న అకాల వర్షాలతో వరిపంట దెబ్బతిని తీవ్రంగా నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని భారతీయ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎల్కతుర్తి మండలంలోని వివిధ గ్రామాల్లో పర్యటించి పంటనష్టాన్ని పరిశీలించారు. సుమారు వెయ్యి ఎకరాల్లో నష్టపోయిన పంటలను పరిశీలించారు. పంటనష్టం అంచనా వేసి నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కిసాన్‌మోర్చా మండల అధ్యక్షుడు బీట్ల లింగయ్య, వెంకటేష్‌యాదవ్, పల్లెపాటి మధుకర్, సారయ్య, మధు తదితరులు పాల్గొన్నారు.



శాయంపేట : పంటను పరిశీలిస్తున్న నాయకులు

కాంగ్రెస్ పార్టీ పరకాల పట్టణ కమిటీ ఎన్నిక

పరకాల: కాంగ్రెస్ పార్టీ పరకాల పట్టణ నూతన కమిటీ అధ్యక్షుడిగా కొయ్యడ శ్రీనివాస్‌ను బుధవారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా మహమ్మద్ అలీ, పోరండ్ల వేణు, మంద నాగరాజు, ఉపాధ్యక్షులుగా ఒంటేరు శ్రావణ్ కుమార్, సూర సతీష్, ప్రధాన కార్యదర్శిగా చందుపట్ల రాజిరెడ్డి, పబ్బ శ్రీనివాస్, కార్యదర్శులుగా ఎం.డీ షఫీ, వీర్ల దిలీప్, ఉడుత అరుణ్‌కుమార్, బొచ్చు కట్టయ్య, గోవింద సమ్మయ్య, పరకాల పట్టణ సోషల్ మీడియా ఇన్‌చార్జ్‌గా గడ్డం శివ, గౌరవ సలహాదారులుగా మంద రాంచందర్, ఒంటేరు రాంమూర్తి, చిన్నాల గోనాథ్, ఉమ్మడి పరకాల మీడియా ఇన్‌చార్జ్‌గా దార్న వేణుగోపాల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కొత్తగా ఎన్నికైన కార్యవర్గాన్ని కాంగ్రెస్ పార్టీ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇనగాల వెంకట్రామిరెడ్డి



నూతన కమిటీతో ఇనగాల వెంకట్రామిరెడ్డి

అభినందించారు. ఈ ఎన్నిక కార్యక్రమంలో పీసీసీ కో ఆర్డినేటర్ బొమ్మనపల్లి అశోక్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు బొచ్చు చందర్, రంజాన్ అలీ, పరకాల మండల అధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి, బుర్ర దేవేందర్, ఎంపీటీసీ శ్రీలత, దుపాకి సంతోష్, ఎల్లగొండ ప్రవీన్, బొచ్చు రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

వెజ్, ఫ్రూట్ మార్కెట్లలో లోపించిన పారిశుద్ధ్యం



లక్ష్మీపురం మోడల్ మార్కెట్ వద్ద బురదమయంగా మారిన రహదారి

వరంగల్: వరంగల్ వ్యవసాయ మార్కెట్ పరిధి లక్ష్మీపురంలోని పండ్ల మార్కెట్, కూరగాయల మార్కెట్‌లో పారిశుద్ధ్యం పడకేసింది. మోడల్ కూరగాయల మార్కెట్ ముందు ఉన్న రహదారులపై సక్రమంగా పారిశుద్ధ్య పనులు చేపట్టకపోవడంతో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో మట్టి కాస్త బురదగా మారింది. పండ్ల మార్కెట్ స్థలంలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణంలో ఉండడంతో పాత కూరగాయల మార్కెట్‌ను తాత్కాలికంగా పండ్ల మార్కెట్ వ్యాపారులకు కేటాయించారు. వారికి కేటాయించిన గదుల్లో వ్యాపారం చేయకుండా రోడ్డుపై దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. ప్రస్తుతం మామిడి సీజన్ ప్రారంభం కావడంతో అందులో చెడిపోయిన పండ్లను వ్యాపారులు మార్కెట్‌లో ఎక్కడ పడితే అక్కడే పడేయడంతో దుర్వాసన వెదజల్లుతుంది. దీంతో కొనుగోలుదారులు అటువైపు వెళ్లాలంటే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

రైతులకు అండగా బీఆర్ఎస్ ప్రభుత్వం

దామెర: బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని ఎంపీపీ కాగితాల శంకర్ అన్నారు. మండలంలోని కోగిల్వాయి, ఊరుగొండలో గత సంవత్సరం పంటనష్టం వాటిల్లిన రైతులకు నష్టపరిహారం చెక్కులను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడారు. దేశంలో ఎక్కడాలేని విధంగా రైతుల కోసం పథకాలు అమలుచేస్తున్న ఏకైకరాష్ట్రం తెలంగాణ అని అన్నారు. పంట నష్టం వాటిల్లిన రైతులు ఆందోళన చెందకూడదని పేర్కొన్నారు. ప్రతి రైతును ఆదుకునేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ నిధులు మంజూరుచేయడం జరిగిందని వెల్లడించారు. రైతు కష్టం తెలసిన నాయకుడు ముఖ్యమంత్రిగా ఉండడం రైతులకు ఎంతగానే ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్,



చెక్కులు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు గట్ల విష్ణువర్దన్ రెడ్డి, ఊరుగొండ సర్పంచ్ గోగుల సత్యనారాయణ రెడ్డి, వైస్ ఎంపీపీ ఎండీ. జాకిర్‌అలీ, మండల పార్టీ అధ్యక్షుడు గండు రాము, ప్యాక్స్ చైర్మన్ బొల్లు రాజు, ప్రజాప్రతినిధులు, ఏఈఓలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల చట్టంపై అవగాహన అవసరం



నూతన కమిటీ సభ్యులు

నడికూడ: వినియోగదారుల చట్టంపై అవగాహన అవసరమని హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ప్రొ.రతన్ సింగ్ ఠాకూర్ అన్నారు. మండల వినియోగదారుల సమాచార కేంద్ర కార్యనిర్వాహక సభ్యుల ఎన్నిక బుధవారం ఏకగ్రీవంగా నిర్వహించారు. అధ్యక్షుడిగా మహ్మద్ జమాల్ ద్దీన్, మహిళా ఉపాధ్యక్షులు నొగరి లక్ష్మి, ఉపాధ్యక్షుడిగా వినుకొండ నవీన్, ప్రధాన కార్యదర్శిగా ముక్కెర రమేష్, సహాయ కార్యదర్శి మహ్మద్ అబ్దుల్ రహీం, కోశాధికారి బొమ్మ అశోక్, కార్యనిర్వాహక సభ్యులు లోకటి నాగేశ్, జవ్వాజి ప్రవీణ్ కుమార్, సంగాల సుమన్, వెంకటేష్, సుధీర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని రతన్ సింగ్ తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ వినియోగదారులు వస్తువుల కొనుగోళ్లు, పర్యావరణపై పడే ప్రభావం గురించి, వినియోగదారుల పరిరక్షణ చట్టం పై, సంపూర్ణమైన అవగాహన కలిగి ఉండాలన్నారు. ఫిర్యాదు ఎలా చేయాలి.. ఎవరికి చేయాలి.. వంటి పలు అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ వల్లంపట్ల నాగేశ్వర్‌రావు, బండ కాళీదాస్(విజిలెన్స్ కమిటీ మెంబర్)చేరాల సర్వేశం, తదితరులు పాల్గొన్నారు.

పంట క్షేత్రాల పరిశీలన

శాయంపేట : మండల పరిధిలోని గ్రామాల్లో కురిసిన ఈదురుగాలులుతో కూడిన వడగండ్ల వర్షాలకు మొక్కజొన్న, వరి, పుచ్చ, మామిడి, మిర్చి పంటల దెబ్బతిన్నాయి. దీంతో బుధవారం వ్యవసాయ విస్తరణ అధికారులు అమ్షద్‌రాజా, రాకేష్, స్టెల్లా వర్షాలతో నేలవాలిన పంట క్షేత్రాలను సందర్శించి పరిశీలించారు. మండల పరిధిలోని గ్రామాల్లో ఏ పంట ఎంత నష్టం వాటిల్లిందో క్లస్టర్ల వారీగా నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు సమర్పిస్తామని తెలిపారు.



పంటను పరిశీలిస్తున్న ఏఈఓలు

ముగిసిన బ్రహ్మోత్సవాలు

శాయంపేట : మండల కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వర, శివ మార్కండేయ ఆలయ సముదాయాలతో గత మూడురోజులుగా కొనసాగుతోన్న దశమ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం ముగిశాయి. వరంగల్ పట్టణంలోని భద్రకాళీ దేవస్థాన ప్రధాన అర్చకులు శేషు శిష్య బృందం గుమ్మడవెల్లి గణేష్ అత్రేయ శర్మ, వడ్డకొండ శివకుమార్ శర్మ, తూర్లపాటి సాయి చరణ్ శర్మ, ఖమ్మం వెట్టు సంతోష శర్మ, పర్చా సాయి కృష్ణప్రసాద్ శర్మ, డెబ్బుట రామానుజచార్య శర్మ, దుర్గాసాయి శర్మ ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చారణల మధ్య షష్టి సుదర్శన హోమం, చండీ హోమం, పూర్ణాహుతి, ధ్వజారోహనం, పండిత సన్మాన కార్యక్రమంలో ఉత్సవాలు పరిసమాప్తి అయ్యాయి. హైదరాబాద్‌లోని వివేక్‌నగర్ అంజనేయస్వామి దేవస్థానం ఎండోమెంట్ సూపరింటెండెంట్ ఆచార్య శేషభట్టర్, ఈఓ దేవనాథం, ప్రధానార్చకులు బుగ్గ లక్ష్మీపతి శర్మ పాల్గొని ఆలయ కమిటీ చైర్మన్ బాసాని పద్మ సూర్యప్రకాశ్, దంపతులను స్వామి వారి శేష వస్త్రాలతో సత్కరించారు. ఈ ఉత్సవాల్లో ఎంపీటీసీ బాసాని చంద్రప్రకాశ్, గ్రామస్తులు బాసాని చంద్రమౌళి, రాజు, నాగభూషణం, బాల్నె తిలక్‌బాబు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

పోటీ ప్రపంచంలో ప్రతిభతోనే ఉద్యోగం

కేయూ క్యాంపస్: ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రతిభ ఉన్న విద్యార్థులకే ఉద్యోగ అవకాశాలు వస్తాయని హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బన్న అయిలయ్య అన్నారు. కళాశాలలో మేనేజ్‌మెంట్ విభాగంలో మ్యాజిక్ బస్సు ఇండియా ఫౌండేషన్ కంపెనీ ఆధ్వర్యంలో ఎంకామ్ విద్యార్థులకు బుధవారం నిర్వహించిన ఉద్యోగమేళా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రోజురోజుకు ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతోందని, అందుకనుగుణంగా తమ నైపుణ్యాలను విద్యార్థులు పెంపొందించుకోవాలని సూచించారు. ప్రైవేట్ రంగంలో పలు కంపెనీలు ఉద్యోగ అవకాశాలను కల్పిస్తున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంబీఏ విభాగం అధిపతి డాక్టర్ కనకయ్య, ప్లేస్‌మెంట్ మేనేజర్ రాఘవకుమార్, విక్రమ్, ప్రణయ్ పాల్గొన్నారు.